క్లుప్తంగా...

ఓయూలో భాగ్యరెడ్డివర్మ జయంతి


భాగ్యరెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో సోమవారం భాగ్యరెడ్డివర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. సోమవారం యూనివర్సిటీలో వివిధ ప్రాంతాలలో అధ్యాపకులు, విద్యార్థులు వేర్వేరుగా జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. పాలన భవనంలో వీసీ ప్రొ.రవీందర్, న్యాయకళాశాలలో డీన్ ప్రొ.గాలి వినోద్‌కుమార్, ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) విద్యార్థి నేతల ఆధ్వర్యంలో భాగ్యరెడ్డివర్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించి ఆయన సేవలను కొనియాడారు.

కిశోర బాలికలకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న భాగ్య

అడ్డగుట్ట: తుకారాంగేట్‌లోని మరాఠా బస్తీలో సోమవారం కిశోర బాలికలతో ఎంవీ ఫౌండేషన్ ఆర్గనైజర్ బుద్ధ భాగ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత కూడా పాటించాలని సూచించారు. చిన్న వయస్సులో ఆడపిల్లలు పెళ్లి చేసుకోవద్దని, 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే చేసుకోవాలన్నారు. చాలా మంది పిల్లలు బాల కార్మికులుగా మారుతున్నారని, ఆ విధంగా కాకుండా పిల్లలందరూ క్రమంగా బడికి వెళ్లి మంచిగా చదువుకోవాలన్నారు. ఎక్కడైనా సమస్యలు ఎదురైతే వెంటనే డయల్ 100 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

లక్ష్మీ నరసింహ స్వామి దర్శనం


లాలాపేట: యాదగిరిగుట్ట (యాదాద్రి) లక్ష్మీ నరసింహ స్వామిని సోమవారం తెలంగాణ జాయింట్ యాక్షన్ నేతలు దర్శించుకున్నారు.ఈ సందర్భంగా టి-జాక్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం మాట్లాడుతూ.. లక్ష్మీనరసింహ స్వామి కరుణ కటాక్షం తెలంగాణ ప్రజలందరికి ఉండాలని ఆకాంక్షించారు. డిసెంబర్‌లో జరిగే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో కర్నాటక ఎన్నికల ఫలితాలే పునరావృతం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర నాయకులు, టీటీడీ మెంబర్ దర్గా సుభేందర్‌రెడ్డి, తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ హైదరాబాద్ జిల్లా చైర్మన్ శ్రీరామ్ శివకుమార్ పాల్గొన్నారు.

బస్తీ అభివృద్ధికి కృషి చేస్తాం


ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

రాంగోపాల్‌పేట్: రైల్ నిలయం అంబేడ్కర్‌నగర్ యూత్ అసోసియేషన్‌కు నూతన కమిటీని ఓటింగ్ పద్ధతిలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కంసాని బాబు, ఉపాధ్యక్షుడిగా రాపర్తి శివకుమార్, ప్రధాన కార్యదర్శిగా దుద్దెడ ఆశీర్వాదం, కార్యనిర్వాహక కార్యదర్శులుగా క్రాంతికుమార్, సంయుక్త కార్యదర్శులుగా మోతే ప్రశాంత్, కోశాధికారిగా మన్నె రవికుమార్ గెలుపొందారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా రాములు, రమేష్, రామకృష్ణ, రత్న కుమార్, లింగం, పరశురాం వ్యవహరించారు. బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా బస్తీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని నూతన కమిటీ ప్రకటించింది.

చట్ట సభల్లో అన్ని వర్గాలకు అవకాశం కల్పించాలి



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: సమాజంలోని అన్ని సామాజిక వర్గాలకు వారి వారి జనాభా దమాషా ప్రకారం చట్టసభల్లో అవకాశం కల్పించాలని బహుజన ప్రజాశక్తి వ్యవస్థాపక కన్వీనర్ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. బహుజన వర్గాలను సంఘటితం చేసి రాజ్యాధికారం వైపు నడిపించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దక్కన్ దళిత వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ.. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు కల్పించటంలో పాలకులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారని విమర్శించారు. మహనీయుల లక్ష్యాలను బహుజన ప్రజాశక్తి ప్రజల్లోకి తీసుకెళ్లి రాజ్యాధికారం వైపు కృషి చేస్తుందన్నారు.

ఐస్ స్కేటింగ్‌లో రయ్‌రయ్

ఐస్ స్కేటింగ్ మిగతా క్రీడల కన్నా విభిన్నమైన ఆట. సాహసమే ఊపిరిగా శీతల రింక్‌లో పదునైన చక్రాలపై దూసుకుపోయే అరుదైన గేమ్. ఎక్కడపడితే అక్కడ ఐస్ స్కేటింగ్‌లో ప్రాక్టీస్ చేయడం కుదరదు. అందుకు కేవలం ఐస్ మైదానమే ఉండాలి. మరి హైదరాబాద్ నగరంలో అలాంటి స్టేడియమే లేదు. కనీసం ఆ క్రీడ గురించి తెలిసిన వారూ చాలా తక్కువ. –సనత్‌నగర్

- ఐస్ స్కేటింగ్‌లో దూసుకుపోతున్న ప్రభాస్ వర్మ
- అంతర్జాతీయ స్థాయి పోటీలకు అర్హత



రోలర్ స్కేటింగ్‌తో ప్రారంభించి ఐస్ స్కేటింగ్‌లో రాణింపు

తెలంగాణ వ్యాప్తంగా ఐస్ స్కేటింగ్ క్రీడలో ప్రాక్టీస్ చేస్తున్న వారి సంఖ్య వేళ్ల మీదనే లెక్కించవచ్చు. అలాంటి వారిలో కొంపల్లికి చెందిన దండు శివ మణికంఠ ప్రభాస్ వర్మ మేటిగా నిలుస్తున్నాడు. ఐస్ స్కేటింగ్ చాంపియన్ షిప్‌లో పాల్గొనడమే తరువాయి.. ప్రతిభ చాటుతాడంటున్నారు శిక్షకులు. ఆ ఆటపై అతనిలో ఉన్న కసి, పట్టుదల, ఆత్మవిశ్వాసమే చాంపియన్‌షిప్‌గా నిలబెడుతుందని చెబుతుంటారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎన్‌సీఎల్ కాలనీ నార్త్‌కు చెందిన దండు వరహాలరాజు–సుధ దంపతుల కుమారుడు వర్మ స్థానికంగా ఉన్న సాధు వాస్వాని ఇంటర్నేషనల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. 2010లో రోలర్ స్కేటింగ్‌లో శిక్షణ మొదలుపెట్టిన వర్మ ఐస్ స్కేటింగ్‌లో సైతం రాణిస్తూ పలు విజయాలను తన ఖాతాలో వేసుకున్నాడు.

ప్రాక్టీస్ కోసం గురుగ్రామ్‌కు..

ఐస్ స్కేటింగ్ రింక్ కేవలం హర్యానా రాష్ట్రం గురుగ్రామ్‌లోనే ఉంది. ఆ తరహా క్రీడలో రాణించాలంటే అంత మామూలు విషయం కాదు. ఎన్నో వ్యయప్రయాసలు సమకూర్చి ఐస్ స్కేటింగ్ రింక్‌లో ప్రాక్టీస్ కోసం గురుగ్రామ్‌కు వెళ్లాల్సిందే. అక్కడి రింక్‌లో కసరత్తు చేస్తేనే రాటుదేలుతారంటారు నిపుణులు. ప్రభాస్ వర్మ ప్రత్యేక క్యాంపుల ద్వారా అక్కడికి వెళ్లి ప్రాక్టీస్ చేస్తూ తరచూ జరిగే చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటున్నాడు. ఈ క్రమంలో ఐస్ స్కేటింగ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, ఐస్ స్కేటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఒలింపిక్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటాడు. ఈ నెల 12న అండర్–17 బాలుర ప్రొఫెషనల్ కేటగిరిలో ప్రతిభను కనబర్చి అంతర్జాతీయ స్థాయి క్యాంప్స్, చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించారు. అంతకముందు జరిగిన ఐదు రాష్ట్ర, జాతీయ స్థాయి చాంపియన్‌షిప్ పోటీల్లో రెండు సార్లు బంగారు పతకాలు, ఒక వెండి, మరొక కాంస్య పతకాలతో పాటు ప్రతిభా సర్టిఫికెట్లను పొందారు.


సాధించిన పతకాలు
కోచ్ మహ్మద్ నసీరుద్దీన్‌తో ప్రభాస్ వర్మ

అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తా

తన తల్లిదండ్రులతో పాటు కోచ్ మహ్మద్ నసీరుద్దీన్ ప్రోత్సాహంతో ఐస్ స్కేటింగ్ క్రీడలో మరింతగా రాణిస్తా. ఇటీవల గురుగ్రామ్‌లో జరిగిన పోటీల ద్వారా అంతర్జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించడం ఉత్సాహాన్ని ఇచ్చింది. ఇదే స్ఫూర్తిగా అంతర్జాతీయ పోటీల్లోనూ రాణించేందుకు కృషి చేస్తా.

–ప్రభాస్‌వర్మ

విద్యార్థులు ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలి


సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ గోపాల్ శర్మ


హాజరైన ప్రతినిధులు, విద్యార్థులు

పద్మారావునగర్: ప్రస్తుత ప్రపంచీకరణ వ్యవస్థలో విద్యార్థులు ఇంగ్లిష్‌పై మంచి పట్టుసాధిస్తే ఎక్కడైనా రాణించడానికి వీలవుతుందని వక్తలు సూచించారు. సికింద్రాబాద్ పద్మారావునగర్ సర్దార్ పటేల్ కాలేజీలో సోమవారం 'లాంగ్వేజ్ లర్నింగ్–ఇంటర్‌నేషనలైజేషన్' అనే అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో డాక్టర్ గోపాలశర్మ, డాక్టర్ నీనాగుప్తా, డాక్టర్ జి. మాధవి, డాక్టర్ అశోక్ హాజరై ప్రసంగించారు. ఆంగ్లభాష నేర్చుకోవడం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. వ్యాకరణ దోషాలు లేని విధంగా ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలన్నారు. ఇంగ్లిష్ బాగా నేర్చుకోవడం ద్వారా ప్రపంచ జ్ఞానం తెలుస్తుందన్నారు. నేర్చుకోవాలనే కుతూహలం, పట్టుదల ఉంటే ఎదైనా సాధించడం సులువవుతుందన్నారు. విద్యార్థులు ఇంగ్లిష్‌పై మంచి అవగాహన, పరిజ్ఞానం ఉంటే జీవితంలో ఉన్నత స్థాయి చేరుకొని హాయిగా జీవించడానికి ఆస్కారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ హేమలత, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ అమర్‌నాథ్ శర్మ, సదస్సు కన్వీనర్ కె. ఇంద్రాణీకృష్ణవేణి, పి. విక్టోరియా రాణి, పి. నాగలక్ష్మీ, రమేష్ పాల్గొన్నారు.

రాజ్యాధికారమే ధ్యేయంగా డీఎస్పీ ముందుకు..


వికాస్ రాజ్‌ను కలిసిన ధర్మ సమాజ్ పార్టీ ప్రతినిధులు

బన్సీలాల్‌పేట్: తెలంగాణలో కొత్త రాజకీయ పార్టీగా ధర్మ సమాజ్ పార్టీ ఆవిర్భవించింది. డాక్టర్ విశారదన్ నేతృత్వంలో కొత్త రాజకీయ పార్టీ పురుడుపోసుకుంది. సికింద్రాబాద్ బుద్ధభవన్‌లో సోమవారం ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ) నాయకులు రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి వికాస్ రాజ్‌ను కలిశారు. ధర్మ సమాజ్ పార్టీ పేరుతో తెలంగాణలో కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించిందని రానున్న కాలంలో ఎన్నికల బరిలో నిలువనున్నట్లు డీఎస్పీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రతినిధులు పలు విషయాలపై ఎన్నికల అధికారి వికాస్ రాజ్‌తో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర నాయకులు అంజయ్య, దుర్గాప్రసాద్, శివన్, కార్తీక్, రాజ్‌కమల్ మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని బతికించడానికి తెలంగాణలో ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ) ఆవిర్భవించిందన్నారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేస్తుందని బహుజనుల పక్షాన రాజ్యాధికారమే ధ్యేయంగా తమ పార్టీ ముందుకు సాగుతుందన్నారు. రాజకీయ అధికారం ద్వారానే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీల హక్కుల పరిరక్షణతో పాటు అభివృద్ధి దిశగా ప్రయాణించగలరని పేర్కొన్నారు. ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ విశారదన్ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 10 వేల కిలోమీటర్లు స్వరాజ్య పాదయాత్ర పేరిట పాదయాత్ర చేశారని గుర్తు చేశారు.

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్


బస్తీ దవాఖానాను ప్రారంభిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

కంటోన్మెంట్: ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని నందమూరి నగర్ కమ్యూనిటీహాల్, లోతుకుంటలో నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి ప్రజలు స్వల్ప వైద్య సేవల కోసం కూడా పడుతున్న ఇబ్బందులను దూరం చేసే లక్ష్యంతోనే సీఎం కేసీఆర్ ఆలోచనల మేరకు బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో ప్రస్తుతం 350 బస్తీ దవాఖానాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని, హైదరాబాద్ జిల్లా పరిధిలో నూతనంగా 14 బస్తీ దవాఖానాలు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్–ఎంఎస్ఐడీసీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె కృశాంక్, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్, హైదరాబాద్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకట్, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు పాండుయాదవ్, లోకనాథం, లాస్య నందిత, నివేదిత పాల్గొన్నారు.

ముంపు సమస్యను పరిష్కరించాం..

పికెట్ నాలాకు వచ్చే వరద నీటితో సమీప కాలనీలు ముంపునకు గురై ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారని, దివంగత ఎమ్మెల్యే సాయన్న మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి ఎస్ఎన్‌డీపీ కార్యక్రమంతో సమస్య పరిష్కరించడం జరిగిందన్నారు. అదే విధంగా అల్వాల్ ప్రాంతంలో కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ హాస్పిటల్ నిర్మాణం కూడా జరుగుతుందని తెలిపారు. కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధి వాసులకు నిరంతరం ఉచితంగా తాగునీటి సరఫరా చేస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానిదే అన్నారు.

అభివృద్ధికి ఆకర్శితులై చేరికలు..

రాంగోపాల్‌పేట్: బీజేపీకి చెందిన మైనార్టీ నాయకులు సోమవారం మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్ ఆధ్వర్యంతో మంత్రి తలసాని సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లోకి చేరుతున్నారన్నారు. రానున్న రోజుల్లో మరెంతో మంది పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు. మహ్మద్ ఆసీఫ్, మహ్మద్ సోహైల్, అబ్దుల్ రెహ్మాన్, సయ్యద్ అమీర్, సోఫియాన్, మహ్మద్ ఖాసీం, మహ్మద్ అర్బాస్, ఎండీ సిద్దిక్ బీఆర్ఎస్‌లో చేరారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి తలసాని

క్రైం కార్నర్..

చెరువులో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

రసూల్‌పురా: అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ శ్రవణ్‌కుమార్ వివరాల ప్రకారం.. సెంట్రల్‌బత్రిలో నివాసం ఉండే శకుంతల వాకింగ్ వెళ్లి వస్తుండగా సమీపంలో ఉన్న చెరువులో ఓ వ్యక్తి మృతదేహం తేలియాడుతూ కనిపించింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ మార్చురీకి తరలించారు.

ఫుట్‌పాత్‌పై..



రాంగోపాల్‌పేట్: ఫుట్‌పాత్‌పై పడివున్న ఓ గుర్తు తెలియని మృతదేహాన్ని గోపాలపురం పోలీసులు గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. బోయిగూడ రైల్వే క్వార్టర్స్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి చనిపోయి ఉన్నాడనే సమాచారం మేరకు పోలీసులు వెళ్లి పరిశీలించారు. మృతుడికి సుమారు 45–50 వయస్సు ఉంటుందని బ్రౌన్ కలర్ చారల టీ షర్ట్, తెలుపు రంగు లుంగీ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతుడి దగ్గర ఎలాంటి ఆధారాలు లేవని స్థానికులను విచారించగా యాచకుడై ఉంటాడని తెలిపారు.

కూతురికి వైద్య పరీక్షల కోసం వెళ్తూ మృత్యుఒడికి..

- ఆలేరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో సీతాఫల్‌మండికి చెందిన మహిళ మృతి


కమల(ఫైల్)

సికింద్రాబాద్: ఒకే కుటుంబానికి చెందిన వారు ఆటోలో వెళ్తుండగా ఆలేరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సీతాఫల్‌మండి బీదలబస్తీకి చెందిన ఓ మహిళ మృతి చెందింది. బీదలబస్తీకి చెందిన గోపాల్ ఆటోడ్రైవర్. ఇతని కుమార్తె రాజేశ్వరి గర్భవతి. అయితే.. గోపాల్ ప్రతినెల జనగామలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రాజేశ్వరికి వైద్య పరీక్షలు చేయిస్తుంటాడు. ఈ క్రమంలో గోపాల్ తన ఆటోలో భార్య కమల(33), కుమార్తె రాజేశ్వరి(గర్భిణి), బావమరిది కుమారుడు అక్షరసాయి(06)తో కలిసి సోమవారం 8.30 జనగామకు బయలుదేరారు.11.30 గంటల సమయంలో ఆలేరు వద్ద వీరి ఆటోను వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కమల తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా, గోపాల్ కాలు విరిగింది. రాజేశ్వరి, అక్షరసాయిలకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం కుటుంబీకులు జనగామకు తరలివెళ్లారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి

- అపస్మారక స్థితిలో బాధితుడు

కంటోన్మెంట్: విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేయడంతో స్పృహ తప్పి పడిపోయిన ఘటన బోయిన్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శివశంకర్ వివరాల ప్రకారం.. కుషాయిగూడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు (టీఎస్ 02జెడ్ 0260) సోమవారం ఉదయం ఈసీఐఎల్ నుంచి ఇస్నాపూర్ (రూట్ నెం. 250/219) వెళ్తున్న క్రమంలో బోయిన్‌పల్లి చౌరస్తా వద్ద ఎడమ వైపు నుంచి ఓవర్ టెక్ చేయబోయిన టూ వీలర్ బస్సును ఢీకొట్టింది. దీంతో టూ వీలర్ నడిపిస్తున్న వ్యక్తి బస్సును ఆపి లోపలికి వచ్చి డ్రైవర్ దయానంద్‌పై దాడి చేయడంతో స్పృహ తప్పి పడిపోయాడు. 108కి కాల్ చేయడంతో అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కండక్టర్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

తాగునీటి సమస్యలు పరిష్కరించాలి


జలమండలి కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

లాలాపేట: తాగునీటి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం శాంతినగర్‌లోని జలమండలి కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో నీటి సమస్యలు ఉన్నా పరిష్కరించడంలో జలమండలి అధికారులు విఫలం అవుతున్నారని ఆరోపించారు. చాలా ప్రాంతాల్లో కలుషిత నీరు సరఫరా అవుతుందని అలాంటి ప్రాంతాలను గుర్తించి సమస్యను పరిష్కరించాలన్నారు. తార్నాక డివిజన్‌లోని గణేష్ నగర్, సత్యానగర్, వినోభానగర్, శాంతినగర్, ఆర్యనగర్ తదితర ప్రాంతాల్లో తరచూ కలుషిత నీటి సమస్య తలెత్తుతుందన్నారు. కొన్ని ప్రాంతాల్లో నల్లా కనెక్షన్ మాత్రమే ఉందని నీరు రావడం లేదని పేర్కొన్నారు. అనంతరం జలమండలి మేనేజర్ కృష్ణప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాముువర్మ, నాగేశ్వర్‌రెడ్డి, హరి, ప్రభుగుప్తా, మల్లేష్, వెంకటేష్ గౌడ్, కిరణ్‌గౌడ్, పోచయ్య, శివారెడ్డి పాల్గొన్నారు.

ఓయూ విద్యార్థుల హంపి యాత్ర


విఠల టెంపుల్ వద్ద విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: యూజీసీ నిబంధనల ప్రకారం ఫీల్డ్ వర్క్‌లో భాగంగా ఓయూ ఆర్ట్స్ కాలేజీ చరిత్ర విభాగం ఎంఏ విద్యార్థులు రెండు రోజుల చారిత్రక యాత్ర చేపట్టారు. చరిత్ర విభాగం హెడ్ ప్రొ.అంజయ్య, డాక్టర్ రమేష్ నేతృత్వంలో 22 మంది విద్యార్థులు కర్ణాటక హంపిలోని విరుపాక్ష, పద్మమహాల్, విఠలా టెంపుల్, ఆనేగొంది, ఏనుగుల కొట్టాలు, మహానవమి దిబ్బ, హజరరామటెంపుల్ తదితర చారిత్రక కట్టడాలను దర్శించినట్లు తెలిపారు. యాత్ర ద్వారా విద్యార్థులు అనేక విషయాలను అవగతం చేసుకున్నట్లు వెల్లడించారు.

వేసవి భక్తి సంగీత శిక్షణ శిబిరం


వేసవి భక్తి సంగీత శిక్షణ పునఃచ్చరణ తరగతులకు హాజరైన ఔత్సాహికులు

నల్లకుంట: శ్రీ సాయి శృతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి భక్తి సంగీత శిక్షణా తరగతులకు విశేష స్పందన వస్తోందని అకాడమీ డైరెక్టర్ గొరిభట్ల వసుధామూర్తి తెలిపారు. ఏప్రిల్ 24న ప్రారంభమైన ఈ శిక్షణ తరగతులు ఈ నెల 27తో ముగుస్తాయని నిర్వాహకులు ప్రకటించారు., ఈ నెల 28న బాగ్ అంబర్‌పేటలోని షిరిడీ సాయిబాబా మందిరం ధ్యాన మందిరంలో ముగింపు వేడుకలు ఉంటాయని వివరించారు. సోమవారం ముగింపు వేడుకల భక్తి సంగీత పునఃచ్ఛరణ శిక్షణా తరగతులు నిర్వహించారు. చిన్నారులు, పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొని కీబోర్డు, భక్తి గీతాలను ఆలపించారు. అకాడమీ డైరెక్టర్ వసుధామూర్తి మాట్లాడుతూ.. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే ముగింపు వేడుకలకు ముఖ్య అతిథులుగా బాగ్ అంబర్‌పేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పద్మావతి డీపీ రెడ్డి, దుర్గా ప్రసాద్‌రెడ్డి దంపతులు, దర్శనం ఆధ్యాత్మిక మాసపత్రిక సంపాదకుడు మరుమాముల వెంకటరమణ శర్మ, ప్రముఖ విద్యావేత్త పుష్పాభట్ హాజరవుతారన్నారు.

నృత్య శిక్షణాతరగతులు..

కాచిగూడ: భరత చూడామణి అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, దాక్షిణాత్యా ఆర్ట్స్ అకాడమీ సంయుక్తాధ్వర్యంలో 'కూచిపూడి ప్రాచీన సంప్రదాయ అడవుసాము పద్ధతి' అనే అంశంపై కాచిగూడలోని నృపతుంగా స్కూల్‌లో సోమవారం విద్యార్థినులకు శిక్షణ తరగతులను నృత్యగురువు డాక్టర్ అనిత రావు ప్రారంభించారు. ఈనెల 24 వరకు ఈ శిక్షణ తరగతులు జరుగుతాయని ఆమె వివరించారు. ఏ నృత్యానికైనా మొదటి అడుగులు పునాది వంటివని, అవి సమంగా నేర్చుకుంటేనే నృత్యాంశాలను చక్కని పదవిన్యాసంతో ప్రదర్శించగలరన్నారు. ప్రాచీన కూచిపూడి నృత్య సంప్రదాయ పరిరక్షణే ధ్యేయంగా యువ, విద్యార్థి నృత్య శిక్షకుల కోసం ప్రత్యేకంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. నృత్య గురువులు నెమలికంటి సువర్ణలత, రామలింగశాస్త్రి, డాక్టర్ తడకమళ్ల అనురాధ తదితరులున్నారు.

సీఎం కేసీఆర్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

- తెలంగాణ రైతులను పట్టించుకోకుండా మహారాష్ట్రకు వెళ్తారా?
- తెలంగాణలో 119 స్థానాల్లో పోటీ చేస్తాం
- అందరిపై అభ్యర్థులను బరిలో దింపుతాం
- శివసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శివాజీ

పంజగుట్ట: తెలంగాణలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకుండా... అకాల వర్షాలకు ధాన్యం తడిసి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే వారిని పట్టించుకోని ముఖ్యమంత్రి కేసీఆర్ మహారాష్ట్రకు వెళ్లి అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ అని వ్యాఖ్యానించడం హాస్యాస్పదమని శివసేన పార్టీ తెలంగాణ అధ్యక్షుడు సింకారు శివాజీ పేర్కొన్నారు. యావత్ తెలంగాణ ఐక్యమై పోరాడితే, రెండు వేల మందికిపైగా అమరులైతే వచ్చిన తెలంగాణలో ఒక కుటుంబం రాజ్యమేలడం దారుణమని ఆయన ఎద్దేవా చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తమ పార్టీ అధ్యక్షుడు ఏక్‌నాథ్ శిండే మోసం చేశారు అని పదేపదే కేసీఆర్ అనడం సరికాదని, ధర్మం దారితప్పుతుంటే సరిచేశారని, యావత్ మహారాష్ట్ర ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. మరోమారు ఏక్‌నాథ్ షిండేను వెన్నుపోటుదారుడు అంటే సహించేది లేదని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో శివసేన పార్టీ తెలంగాణలో 119 స్థానాల్లో పోటీ చేస్తుందని వెల్లడించారు. 33 శాతం మహిళలకు, 50 శాతం బీసీ ఉద్యమకారులకు, ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం టిక్కెట్లు కేటాయిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో ప్రత్యేక రాష్ట్రం కోసం వాటర్ ట్యాంక్ ఎక్కి దూకి రెండు కాళ్లు పోగొట్టుకున్న ఉద్యమకారుడు రమేష్, జై తెలంగాణ అంటూ ట్రైన్‌కు ఎదురుగా వెళ్లి చేతులు, కాళ్లు పోగొట్టుకున్న పిడమర్తి నాగరాజ్‌కు తమ పార్టీ అభ్యర్థులుగా టిక్కెట్లు ఇస్తామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఒక రైతును నిలబెడతామని, కేటీఆర్‌పై పద్మశాలీ సోదరుడు లేక సోదరిని, హరీష్‌రావుకు పోటీగా తెలంగాణ ఉద్యమకారుడిని, కవితకు పోటీగా పసుపు రైతును నిలబెడతామన్నారు. త్వరలోనే తమ నాయకుడు ఏక్‌నాథ్ షిండే రాష్ట్రానికి రానున్నారని, ఒక భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామన్నారు.

జీవ వైవిధ్య పరిరక్షణ అధ్యయన భవనం ప్రారంభం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ సైన్స్ కోర్సుల విభాగాల వైపు సివిల్ సర్వీస్ అకాడమీ సెంటర్ పక్కన నిర్మించిన జీవ వైవిధ్య పరిరక్షణ అధ్యయన కేంద్రం (సీబీసీఎస్) భవనాన్ని సోమవారం వీసీ ప్రొ.రవీందర్ ప్రారంభించారు. రూ.2 కోట్ల వ్యయంతో కేంద్ర ప్రభుత్వం అందించిన రూసా నిధులతో సీబీసీఎస్ భవనాన్ని నిర్మించినట్లు అధికారులు తెలిపారు. ఓయూలో 2019 ఏర్పాటు చేసిన జీవ వైవిధ్య పరిరక్షణ అధ్యయన కేంద్రం ప్రస్తుతం క్యాంపస్‌లోని సీఎఫ్ఆర్‌డీ (రౌండ్ బిల్డింగ్)లో కొనసాగుతోంది. తెలంగాణ బయోడైవర్సిటీ సెంటర్, రాష్ట్ర అటవీ శాఖ, యూకే సౌత్ వెల్స్ వర్సిటీ సహకారంతో వివిధ రకాల జీవులపై పరిశోధనలు చేయనున్నారు. వాతావరణ మార్పుల వల్ల ఒక ప్రదేశం నుంచి మరో ప్రాంతానికి, దేశాలకు వలస వెళ్లే పక్షులు, ఇతర జీవులపై అధ్యయనంతో పాటు వాతావరణం మార్పుల పై పరిశోధనలు చేయనున్నారు. కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్, సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ.వీరయ్య, డైరెక్టర్ ప్రొ.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.